# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

• కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెద్దమందడి, నవంబర్ 22 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మండలంలోని వెల్టూరులోని జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల, కొత్తకోట మండలం అమడబాకుల జూనియర్ కళాశాల వసతి గృహాన్ని, వనపర్తి కేజీబీవీని శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. వసతి గృహాల్లో ఆహార పదార్థాల నాణ్యత వాటి గడువు తేదీ పరిశీలించడంతోపాటు స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల, కళాశాలల సిబ్బందిని ఆయన ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు.

### భోజనం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి

వనపర్తి టౌన్, నవంబర్ 22 : జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు అందించే భోజనం కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, వసతి గృహాల్లో మధ్యాహ్న భోజనంలో కలుషిత ఆహారం తిని పిల్లలు అస్వస్థతకు గురయ్యారనే వార్తలు వస్తున్నాయని, జిల్లాలో ఇలాంటి ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహం, విద్యాలయాల్లో స్టాక్ రిజిస్టర్, రోజువారీగా స్టాక్ ఇచ్చే రిజిస్టర్లు కచ్చితంగా పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా నీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, వండే సమయంలో ఆహార పదార్థాలను తాగునీటితో కడిగి తాగునీటితో వంట చేయాలని సూచించారు. వంట అయిన వెంటనే ఆహారాన్ని సూపర్‌వైజర్ తిని బాగుంటేనే పిల్లలకు పెట్టాలని సూచించారు. విద్యార్థులు చేతులు, కాళ్లు శుభ్రం చేసుకునేందుకు సరిపడా సబ్బులను ఉంచాలన్నారు. వంట చేసే వారికి వైద్య రక్త పరీక్షలు చేయించాలని, పాఠశాలలు, వసతి గృహాలు, మోడల్ స్కూల్, కేజీబీవీలను సంక్షేమ శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు సందర్శించి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, జి.వెంకటేశ్వర్లు, ప్రత్యేక అధికారులు, ఎంఈవోలు, సంక్షేమ శాఖ అధికారులు, ప్రిన్సిపాళ్లు ఉన్నారు. అలాగే సాయంత్రం కలెక్టర్ వనపర్తి కేజీబీవీని సందర్శించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.



వనపర్తి కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

### విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

గద్వాలటౌన్/ అయిజ, నవంబర్ 22 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, అయిజ పట్టణంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా భాగంగా భోజనశాలను పరిశీలించి వంటకాలను తనిఖీ చేశారు. అలాగే తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఉదయం, రాత్రి వేళల్లో నాణ్యమైన సరుకులతో భోజనం అందించడంతోపాటు పండ్లు, గుడ్లు నాణ్యమైనవి అందించాలన్నారు. భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. వసతి గృహాలతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల గదులను శుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న పదార్థాలు, శుభ్రత, విద్యపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటయ్య, టీపీ అశోక్, వార్డెన్ ఈశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

### మధ్యాహ్న భోజనం తనిఖీ

మల్దకల్, నవంబర్ 22 : మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలతోపాటు ఎల్కూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఎంఈవో సురేశ్ తనిఖీ చేశారు. ముందుగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఏజెన్సీ వారితో మాట్లాడారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. బియ్యం బస్తాలో పురుగులు ఉంటే వాటిని వెంటనే డీలర్ ద్వారా రిటైన్ చేయాలని ఆదేశించారు. అలాగే పాఠశాల హెచ్‌ఎంలు వంటలపై పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

### మంచి సరుకులను ఉపయోగించాలి

అయిజ, నవంబర్ 22 : ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్నభోజనంలో నాణ్యమైన సరుకులను ఉపయోగించాలని ఎంఈవో రాములు వంట ఏజెన్సీలను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో ఉపయోగించే బియ్యం, కూరగాయలు, ఆకుకూరల నాణ్యతను పరిశీలించారు. వండే సమయంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలన్నారు.

## పేదింటి ఆడపడుచులకు అండగా ప్రభుత్వం



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

• ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, నవంబర్ 22 : పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ధరూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 64లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే కేటీదొడ్డి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13మంది బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, నాయకులు బండారిభాస్కర్, గడ్డంకృష్ణారెడ్డి, సుదర్శన్ రెడ్డి, రాజశేఖర్, శ్రీధర్, వెంకటేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, చక్రధర్‌రావు, శేఖర్, వెంకన్ గౌడ్ పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఉత్సవాలు

గట్టు, నవంబర్ 22 : గట్టులో అంబాభవానీ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకొని పూజలు చేశారు. జాతర సందర్భంగా మాజీ సర్పంచ్ మోహన్‌గౌడ్, గ్రామ నాయకుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకు ముందు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్వ హన్మంతు, వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్ క్యామ వెంకటేశ్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, బజారి, రాముడు, రాజప్ప పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు రాజకీయ వేదికలుగా మారడం బాధాకరం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

• బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

గద్వాల రూరల్, నవంబర్ 22 : కాంగ్రెస్ పాలనలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు రాజకీయ వేదికలుగా మారడం బాధాకరమని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వపల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద ఉన్న ధ్యాం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో పదేళ్లు కొనుగోలు కేంద్రాల వద్ద ప్రశాంతమైన వాతావరణంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేశారని గుర్తు చేశారు. బీరెల్లి కొనుగోలు కేంద్రం వద్ద గురువారం ఘర్షణ వాతావరణం నెలకొన్నదని, రైతులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. అబద్ధపు వాగ్ధానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అమలు చేసిన తర్వాతనే వడ్లు కొనుగోలు చేయాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుండా, రైతుభరోసా ఇవ్వకుండా విజయోత్సవాలు నిర్వహించుకోవడం సిగ్గుచేట్టన్నారు. కార్యక్రమంలో రైతులు కుర్మన్న, వెంకటన్న, జయన్న, మదన్, రాజు, రమేశ్, రవి, రాజశేఖర్, మల్లేశ్ పాల్గొన్నారు.

## కాల్వలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

గద్వాల అర్బన్, నవంబర్ 22 : జూరాల కుడి కాల్వలో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. గద్వాల టౌన్ పోలీసుల కథనం ప్రకారం జిల్లా కేంద్రంలోని హమాలీ కాలనీకి చెందిన రాములమ్మ రెండు రోజుల కిందట కుటుంబ సభ్యులతో ఘర్షణ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో భర్త గోకారి భార్య కనిపించడం లేదని గద్వాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో జూరాల కుడి కాల్వలో వృద్ధురాలి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా రాములమ్మగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### ఉరేసుకొని మహిళ మృతి

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 22 : కడుపునొప్పి భరించలేక చీరతో మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉండవల్లిలో చోటుచేసుకున్నది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. కర్నూల్‌జిల్లా బ్రహ్మణకొట్కూర్‌కు చెందిన గంటెపోగు స్వాతి (20) ఉండవల్లికి చెందిన మధుబాబుతో రెండేండ్ల కిందట వివాహమైంది. అయితే ఏడాది నుంచి స్వాతి కడుపునొప్పితో బాధపడుతుందని దవాఖానలో చూపించినా తగ్గలేదని తెలిపారు. దీంతో శుక్రవారం కడుపునొప్పి భరించలేక మనస్తాపంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరేసుకొని మృతి చెందిందన్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. వీరికి 14 నెలల బాబు ఉన్నాడని తెలిపారు.

### వడ్డేపల్లిలో..

వడ్డేపల్లి, నవంబర్ 22 : ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శాంతినగర్‌లో చోటు చేసుకున్నది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.. శాంతినగర్‌లోని వడ్డేపల్లి రోడ్డులో పసిరికలకు మందు ఇచ్చే నాగమణి(54) గురువారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలికి భర్త సత్యనారాయణ, ఇద్దరు కుమారులు వున్నారు. మృతురాలి కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మదనాపురం, నవంబర్ 22 : మదనాపురం మండల కేంద్రానికి చెందిన సుల్తాన్ శుక్రవారం తన బంధువు చనిపోతే ఆత్మకూరు పట్టణానికి స్కూటీపై వెళ్తుండగా చింతకుంట క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో సుల్తాన్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం సుల్తాన్ మృత దేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ దవాఖానలో ఉంచారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు ఎస్సై తెలిపారు.

### భార్యను వేధించిన కేసులో భర్తకు మూడేండ్ల జైలుశిక్ష

అమరచింత, నవంబర్ 22: భార్యను శారీరకంగా, మానసికంగా వేధించిన కేసులో భర్త మార్క కృష్ణమూర్తికి ఆత్మకూర్ మున్సిఫ్ కోర్టు జడ్జి జానకి మూడేండ్ల జైలుశిక్షతోపాటు రూ.2వేల జారిమానాను విధిస్తూ తీర్పునించారని ఎస్సై సురేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ అమరచింత పట్టణంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న రాధమ్మ భర్త కృష్ణమూర్తి తనను శారీరకంగా, మానసికంగా నిత్యం వేధిస్తున్నాడని 2017 ఏడాదిలో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై సత్యనారాయణరెడ్డి కేసు నమోదు చేశారు. అమరచింత ఏఎస్సై జామీర్‌దీన్ చేపట్టిన విచారణలో భర్త వేధింపు నిజమేనని తెలడంతో ఆత్మకూర్ కోర్టులో వాదనలు వినిపించగా, ప్రభుత్వ న్యాయవాది అరుణోదయకుమార్ బాధితుల తరుపున వాధించి నేరం రుజువు చేయడంతో జడ్జి నిందితుడికి జైలుశిక్షతో పాటు జారిమానా విధించారన్నారు. నిందితుడుకి శిక్ష పడేలా కృషి చేసిన ఎస్సై సురేశ్‌ను, ప్రభుత్వ న్యాయవాది అరుణోదయకుమార్‌ను ఎస్పీ గిరిధర్ ప్రత్యేకంగా అభినందించారు.

### హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా విజయభాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబర్ 22 : హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా ఆత్మకూరు పట్టణానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి నియామకమయ్యారు. రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ హైకోర్టు ఫారెస్ట్ కౌన్సిల్‌గా వై.విజయభాస్కర్‌రెడ్డిని నియమించడంపై ఆత్మకూరు ప్రముఖులు హర్షం వ్యక్తంచేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు విజయభాస్కర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడానికే క్రీడలు

• అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల, నవంబర్ 22 : దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడానికే డిసెంబర్3న జరిగే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా పోటీలు నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లాలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్‌ల సాధికారిత శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రన్నింగ్, పుట్ బాల్, క్యారమ్స్, చెస్, ట్రైసైకిల్స్ వంటి క్రీడా పోటీలు నిర్వహించగా పోటీలను అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు వెనుకబాటు తనానికి గురికాకుండా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించి సమాజంలో సుస్థిరమైన స్థానం కల్పిస్తూ వారిని చైతన్యవంతులు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో అధికారులు సుధారాణి, ఆనంద్ దివ్యాంగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుల క్రీడా పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

## విద్యార్థులు లక్ష్యాలకు అనుగుణంగా చదవాలి

• అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి టౌన్, నవంబర్ 22 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటికి అనుగుణంగా చదవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. జిల్లాకేంద్రంలోని కస్తుర్బా బాలికల విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు స్ఫూర్తి పేరుతో కెరీర్ గైడెన్స్, పరీక్షల సన్నద్ధతపై ప్రేరణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వైద్యం, బ్యాంకింగ్ రంగాల్లో ఉద్యోగాలు సాధించేందుకు ఏఏ కోర్సులు తీసుకోవాలో, వాటికి ఏ విధంగా సిద్ధం కావాలని అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ రామచంద్రరావులు వైద్య విద్యపై తమ అనుభవాలను విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో జీసీడీవో శుభలక్ష్మి, స్కూల్ అసిస్టెంట్ కిరణ్, పల్ల శ్రీనివాసులు, విద్యార్థినులు ఉన్నారు

## బీసీ కమిషన్ చైర్మన్‌కు పలు కుల సంఘాల వినతి

ఖిల్లాఘణపురం, నవంబర్ 22 : ఉమ్మడి మహబూబ్ నగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన వెనుకబడిన తరగతుల వారి స్థానిక సంస్థల ఎన్నికల బహిరంగ విచారణ సమావేశంలో వనపర్తి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు విజయ్ పాల్గొని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అందులో రజకులకు కూడా తగిన రాజకీయ అవకాశాలు ఇవ్వాలని బీసీ కమిషన్‌కు వివరించినట్లు చెప్పారు. రాజకీయంగా స్థానిక సంస్థల్లో రజకులకు ఎలాంటి రిజర్వేషన్లు లేవని, అందుకని బీసీ–ఏలో రజకులకు ప్రత్యేక రిజర్వేషన్ ఏర్పాటు చేసి ఏ,బీ,సీ,డీ వర్గీకరణ చేయాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు ఆయన చెప్పారు.

### వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వినతి..

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య ఆధ్వర్యంలో బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెలకు గుట్టపై పూర్తి హక్కులు కల్పించాలని, వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో వడ్డెరలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా కన్వీనర్ సింగరపు కొండయ్య, సలహాదారులు లక్ష్మయ్య, నర్సింహ, రాములు ఉన్నారు.

## నిరంతరం ఆన్‌లైన్ సేవలు కొనసాగించాలి

వనపర్తి టౌన్, నవంబర్ 22 : వనపర్తి భవన, నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు కార్మికులకు నిరంతరం ఆన్‌లైన్ సేవలు కొనసాగించాలని తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం యూనియన్ అధ్యక్షుడు గంధం మదన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిల్డింగ్ వర్కర్స్‌కు కార్మిక సంక్షేమ బోర్డులో 2008 ఏడాదిలో పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు నుంచి అక్రమంగా దారి మళ్లించిన రూ.1000కోట్లను తిరిగి బోర్డులో జమ చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుండి విడిపోయిన తెలంగాణకు రావాల్సిన వెల్ఫేర్ బోర్డు నిధులు వాటా రూ.400కోట్లు బ్యాంకులో ములుగుతున్నాయని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డులో జమచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కుర్మన్న, వెంకటయ్య, జిల్లా నాయకులు శ్రీను, నరేందర్, భాస్కర్, బాలరాజు, పుల్లయ్య, బాబు, రవి, రాజు ఉన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

### సన్నాలకు బోనస్

వనపర్తి టౌన్, నవంబర్ 22 : వానకాలం 2024–25 ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లాలో 403 కొనుగోలు కేంద్రాలకు గానను 260 సన్న వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో 201 సన్న వడ్ల కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటివరకు 10089.000 ఎంటీఎస్ సన్న వడ్లు కొనుగోలు చేశామని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా సన్న వడ్లకు బోనస్‌గా క్వింటాకు రూ.500 చొప్పున ఇప్పటి వరకు కొంత మంది రైతుల ఖాతాలో రూ.16,55,200 జమ చేసినట్లు ఆయన చెప్పారు.

### దరఖాస్తులకు ఆహ్వానం

గద్వాల అర్బన్, నవంబర్ 22 : జిల్లా కేంద్రంలోని కోర్టులో టైపిస్టు, రికార్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి గంట కవితాదేవి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోస్టులను ప్రత్యక్ష నియామకం ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 28వ తేదీ సాయంత్రం 5గంటలలోగా రిజిస్టర్ లేదా కొరియర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఈ కోర్టు వెబ్‌సైట్‌లో సంప్రందించాలని సూచించారు.

### రెండురోజుల పాటు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచారం

ఖిల్లాఘణపురం, నవంబర్ 22 : ఈ నెల 23, 24న (శనివారం, ఆదివారం) రెండురోజుల పాటు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార దినాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌వో)లు హాజరుకావాలని, పీఎస్ఈఎస్, డీఎస్ఈ, లాజికల్ ఎర్రర్‌లతో సహా అన్ని ఫీల్డ్ ధ్రువీకరణ పూర్తి చేయాలని సూచించారు.

### రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ఖిల్లాఘణపురం, నవంబర్ 22: మండలకేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 24వతేదీ ఆదివారం శంకర కంటి దవాఖాన జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, ఓటరుకార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, ఫోన్ నెంబర్ తీసుకురావాలని సూచించారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పెబ్బేరులో సమస్యలు పరిష్కరించాలి

• ఐఏఎస్ అధికారి శ్రీదేవిని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

పెబ్బేరు, నవంబరు 22: పెబ్బేరు మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను తీర్చాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ టీకే శ్రీదేవిని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ శుక్రవారం కోరారు. హైదరాబాద్‌లోని ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు చైర్‌పర్సన్ చెప్పారు.



టీకే శ్రీదేవికి వినతి పత్రం అందజేస్తున్న కరుణశ్రీ

## జర్నలిస్టుని బెదిరించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

• బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్ కుమార్

గద్వాల అర్బన్, నవంబర్ 22 : ఇసుక మాఫియాపై ఓ పత్రికలో వార్త రాసిన జర్నలిస్టును బెదిరించిన మహేందర్ గౌడ్‌ను తక్షణమే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ అధికారులను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ శుక్రవారం ప్రకనటలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాడ్డక జిల్లాలో ఇసుక మాఫియా ఎలా జరుగుతుందో పూర్తి విషయాలను వార్తపత్రికలో ప్రచురించిన జర్నలిస్ట్‌పై నోటితో మాట్లాడలేని పదాలను వాడుతూ చంపేస్తా..నరికేస్తా.. బొక్కలు ఉడగొడుతా.. అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు.

ఇసుక మాఫియాకు ప్రస్తుత అధికార పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు పూర్తి స్థాయిలో మద్దతు అందిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇసుక మాఫియాను అరికట్టాలని డిమాం డ్ చేశారు. అలాగే ఇసుక మాఫియా నుంచి జర్నలిస్ట్‌కు ప్రాణహని ఉందని, జర్నలిస్ట్‌కు ఏమైనా జరిగితే పూర్తిబా ధ్యత వారిదేనన్నారు. తక్షణమే జర్నలిస్టుకు రక్షణ కల్పించాలని పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

### జర్నలిస్టులపై బెదిరింపులు తగదు

ధరూరు, నవంబర్ 22 : నిజాన్ని నిర్భయంగా, ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే జర్నలిస్టులకు బెదిరింపులు చేయడం తగదని జోగుళాంబ గద్వాల జిల్లా దళిత జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు దాదెపోగు వెంకటన్న శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు. గద్వాల నియోజకవర్గానికి చెందిన సాక్షి రిపోర్టర్ కిరణ్‌కు ఫోన్ చేసి ఓ మాఫియా నాయకుడు బెదిరించడంపై మండిపడ్డారు. జిల్లాలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పిందని, జర్నలిస్టులపై బెదిరింపులకు పాల్పడుతున్నా పోలీస్ డిపార్ట్‌మెంట్ సైలెంట్‌గా ఉండడం మంచిది కాదన్నారు. జర్నలిస్టును బెదిరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిని జర్నలిస్టులందరూ ఖండించాలని ఆయన ప్రతిక ముఖంగా కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338964-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

## బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 22 : ఉండవల్లి మండలం పుల్లూరులో నాగమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు గ్రామానికి చేరుకొని పార్థివదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు. కాగా అదేగ్రామానికి చెందిన లక్ష్మీ దేవి అనారోగ్యంతో కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స తీసుకుంటున్నది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు దవాఖానకు వెళ్లి పరామర్శించారు.

### డీఈవోగా గోవిందరాజులు నియామకం

గద్వాలటౌన్, నవంబర్ 22: జోగుళాంబ గద్వాల ఇన్‌చార్జి డీఈవోగా విధులు నిర్వర్తిస్తున్న మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్ ఇటీవలే ఏసీబీకి పట్టుబడ్డారు. దీంతో నాగర్‌కర్నూల్ డీఈవో గోవిందరాజులను జిల్లా డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన శనివారం విధులు చేపట్టనున్నారు.

### మాదాసి కురవ నమోదు చేయాలి

మల్దకల్, నవంబర్ 22 : కురువ కులస్తులు సమగ్ర సర్వేలో భాగంగా తమ కులాన్ని మాదాసి కురువ కులంగా సర్వే ఫారంలో నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ వాపోతున్నారు. సూపర్‌వైజర్ నరహరి కథనం మేరకు మండలంలోని మద్దెలబండ గ్రామంలో ఎన్యుమరేటర్లు ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నారన్నారు. అయితే గ్రామంలో 292 కుటుంబాలు కుర్వ కులస్తుల ఇండ్లు ఉండగా 90కుటుంబాలు మాత్రం సర్వేకు సహకరించి వారి కులాన్ని చెప్పారన్నారు. మిగతా 202 కుటుంబాలు మాత్రం సర్వేకు సహకరించడం లేదన్నారు. తమ కులాన్ని మాదాసి కురువగా నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపాడు. దీంతో విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా ఆయన జెడ్పీ సీఈవో దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఆమె గ్రామాన్ని సందర్శించి వారితో మాట్లాడారు. మా దాసి కురువ సర్టిఫికెట్ ఉంటే దాని ప్రకారం నమోదు చేస్తామని వారికి వివరించారు. లేకుంటే కుర్వ కులంగానే నమోదు చేస్తామని వారికి వివరించారు. సర్టిఫికెట్ తెస్తే మాదాసి కురువగా నమోదు చేస్తామని ఎన్యుమరేటర్లు తెలుపగా అలాంటి సర్టిఫికెట్లు తమతో లేవని తెలుపుతున్నట్లు వాపోయాడు. గ్రామానికి చెందిన కొందరు కుర్వ కులస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అంటున్నట్లు సూపర్‌వైజర్ తెలిపారు.

### 86మంది పిల్లలకు పరీక్షలు

గద్వాలటౌన్, నవంబర్ 22 : జిల్లా కేంద్రంలోని దూద్ దవాఖానలో హృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నపిల్లల ఉచిత గుండె వ్యాధుల చికిత్స వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సిద్ధప్ప సందర్శించి శిబిరం నిర్వహణకు గురించి అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో మొత్తం 86మంది పిల్లలకు గుండె పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వారిలో గుండె వ్యాధుల సమస్యలతో 30మంది బాధపడుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అలాగే 5మంది పిల్లలకు శస్త్ర చికిత్స ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. మరో 25మంది పిల్లలకు సాధారణ వైద్య సేవలు అందిస్తే సరిపోతుందని తెలిపారు. శిబిరం నిర్వహణపై ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సంతృప్తిని వ్యక్తం చేశారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అయిజ, నవంబర్ 22 : అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పట్టణంలోని బ్రైట్‌స్టార్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడోతరగతి విద్యార్థి కృపసాగర్ ఎంపికయ్యాడు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో హైదరాబాద్‌లోని దోమలగూడ ఉన్నత పాఠశాలలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు కరస్పాండెంట్ ఎస్తేర్, డైరెక్టర్ దివ్యజ్యోతి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకు కృషి చేసిన పీఈటీ సుబ్బన్న, విద్యార్థిని అభినందించారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

• మరో ఇద్దరికి జరిమానా

ఖిల్లాఘణపురం, నవంబర్ 22 : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన నలుగురిని శుక్రవారం జిల్లా కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై సురేశ్‌గౌడ్ తెలిపారు. వనపర్తి జిల్లా కోర్టు జడ్జి ఇద్దరికి మూడురోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.1000జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

### ఒకరికి జైలుశిక్ష

మదనాపురం, నవంబర్ 22 : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా మూడురోజుల శిక్ష విధించినట్లు మదనాపురం ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం మేరకు ఈనెల 17వ తేదీన మండలకేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా దుప్పల్లి గ్రామానికి చెందిన బత్తుల బాలరాజ్ మద్యం తాగి బైక్ నడుపుతూ పట్టుబడటంతో శుక్రవారం వనపర్తి అదనపు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చారు. జడ్జి జానకి మూడురోజుల జైలుశిక్ష విధించడంతో మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.